PRAJASWARAM
ప్రజాస్వరం
తెలుగు దినపత్రిక
MHR TV
మెదక్ సంపుటి: 19 సంచిక : 28 సోమవారం 29, సెప్టెంబర్ 2025 పేజీలు: 09 వెల: రూ.1
Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com

# ఏ క్షణమైనా నోటిఫికేషన్!

## మూడు దశల్లో స్థానిక ఎన్నికలు!

### ఖరారైన 31 జడ్పీల రిజర్వేషన్లు

- బీసీ13, ఎస్సీ6, ఎస్టీ4, జనరల్ 8
- 31 జడ్పీల్లో 15 సీట్లు మహిళలకు
- పీఆర్ డైరెక్టర్ గెజిట్ విడుదల
- జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు కూడా ఖరారు
- అధికారులతో ఎస్ఈసీ మీటింగ్
- కమిషనర్‌కు 4 శాఖల నివేదికలు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేటకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం పంచాయతీరాజ్ శాఖ ఇందుకు సంబంధించిన కసరత్తు మొదలుపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వేర్వేరు జీవోలు (జీవోనంబర్9, 41, 42) మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్లను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఖరారు చేశారు. రాష్ట్రంలో మొత్తం 31 జిల్లా పరిషత్‌లు ఉండగా, బీసీలకు 13, ఎస్సీలకు ఆరు, ఎస్టీలకు నాలుగు, జనరల్ (అన్‌రిజర్వుడ్) స్థానాలు ఎనిమిదిగా ..మిగతా 2లో






## పదేళ్లు నాకు అవకాశం ఇవ్వండి

- పదేళ్లలో న్యూయార్క్‌ను మరిపించే నగరం నిర్మిస్తాం
- ప్రాజెక్ట్‌పై వస్తున్న విమర్శలను ఖండిస్తున్నాం
- ఇది నా వ్యక్తిగత ఆస్తుల కోసం కాదు భవిష్యత్ తరాల కోసమే..
- రంగారెడ్డి జిల్లాలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి శంకుస్థాపన

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తనకు పదేళ్లు సమయం ఇస్తే, ప్రపంచ ప్రఖ్యాత నగరం న్యూయార్క్‌ను మించిపోయేలా తెలంగాణలో ఒక అద్భుతమైన నగరాన్ని నిర్మించి చూపిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై కొందరు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించిన ఆయన, ఈ బృహత్తర ప్రాజెక్ట్ తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, రాష్ట్ర భవిష్యత్ తరాల ఉజ్వల భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేటలో ఆదివారం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "విదేశాలకు వెళ్లి వచ్చిన ప్రతి ఒక్కరూ న్యూయార్క్, సింగపూర్, దుబాయ్ నగరాల గొప్పదనం గురించి చెబుతుంటారు. మనం ఇంకెన్నాళ్లు ఆ నగరాల గురించి మాట్లాడుకుంటూ ..మిగతా 2లో




## గ్రూప్–2 ఫలితాలు విడుదల

- మొత్తం 783 ప్రభుత్వ ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తి
- 5.5 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా తుది జాబితా ప్రకటన
- దసరా లోపే నియామక పత్రాలు అందించేందుకు ఏర్పాట్లు
- 10 నెలల్లోనే ఫలితాలు ఇచ్చామన్న టీజీపీఎస్సీ చైర్మన్
- అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న మెరిట్ జాబితా

02




## విద్యా రంగంలో కొత్త అధ్యాయం

- సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ వరం
- వర్సిటీతో తెలంగాణ యువతకు విద్యా అవకాశాలు
- రూ.24 కోట్లతో 8.4 కి.మీ ప్రహరీ నిర్మాణం
- పనులు ప్రారంభించిన మంత్రి సీతక్క

02



## బీసీసీఐ కొత్త అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్

- బీసీసీఐ కొత్త బాస్‌గా మాజీ క్రికెటర్
- రోజర్ బిన్నీ స్థానంలో మిథున్ మన్హాస్ ఏకగ్రీవంగా ఎన్నిక
- వార్షిక సర్వసభ్య సమావేశంలో కీలక నిర్ణయం
- అధ్యక్ష పదవి చేపట్టిన మూడో మాజీ క్రికెటర్‌గా గుర్తింపు
- మరోసారి వైస్ ప్రెసిడెంట్‌గా రాజీవ్ శుక్లా

02



## చెరువులపై కన్నేస్తే తాట తీస్తా..

- కబ్జాదారులకు సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్
- బతుకమ్మకుంట ప్రారంభించిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్, ప్రజాస్వరం :**

తాను హైడ్రా ఆలోచన చేసినప్పుడు చాలామంది చాలా రకాలుగా మాట్లాడారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొంతమందికి అర్థం ..మిగతా 3లో



## టీమిండియా థ్రిల్లింగ్ విక్టరీ

- తిలక్ వర్మ అదరహో.. ఆసియా కప్ మనదే..
- 5 వికెట్ల తేడాతో గెలిచి ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా
- నాలుగు వికెట్లతో పాక్‌ను దెబ్బతీసిన స్పిన్నర్ కుల్దీప్ యాదవ్
- అజేయ అర్ధశతకంతో జట్టును గెలిపించిన తిలక్ వర్మ
- కీలక సమయంలో రాణించిన శివమ్ దూబే
- దుబాయ్ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్

03

**ఆట మైదానంలో ఆపరేషన్ సిందూర్**

## జూబ్లీహిల్స్‌లో కేటీఆర్ కొత్త అస్త్రం

- ఉప ఎన్నికలో బీఆర్ఎస్ వినూత్న ప్రచారం
- కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులకు బదులుగా 'బాకీ కార్డులు' పంపిణీ
- ఇంటింటికీ తిరిగి కార్డులు పంచుతున్న కేటీఆర్
- నెరవేర్చని హామీలతో ప్రజలకు కాంగ్రెస్ బాకీపడిందని విమర్శ
- ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ప్రజలకుఈ పిలుపు
- ప్రభుత్వ పాలనపై తీవ్ర స్థాయిలో ఫైర్



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో అధికార కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పంపిణీ చేసిన 'గ్యారెంటీ కార్డుల'కు బదులుగా.. ఇప్పుడు బీఆర్ఎస్ 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పేరుతో ప్రజల్లోకి వెళుతోంది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, ఇంటింటికీ తిరిగి ఈ కార్డులను పంపిణీ చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట, సమతా కాలనీలలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఇతర ..మిగతా 2లో

## బీఆర్ఎస్‌లో అలకలు

- మాగంటి సునీతకు జూబ్లీహిల్స్ గులాబీ టిక్కెట్ కన్ఫామ్
- టిక్కెట్ దక్కక అలకబూనిన ఆశావహులు
- ఇంతకు ముందు యాక్టివ్‌గా తిరిగిన విష్ణువర్ధన్‌రెడ్డి
- అభ్యర్థి ప్రకటన తర్వాత ముఖం చాటేసిన విష్ణు
- టిక్కెట్ తనకేనని అనుకున్న రావుల శ్రీధర్‌రెడ్డి



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్‌లో గులాబీ ముళ్ళు గట్టిగానే గుచ్చుకుంటున్నాయా? అభ్యర్థి ప్రకటన తర్వాత అలకలు పెరిగిపోయాయా? వాటివల్ల విజయావకాశాలు ప్రభావితం అయ్యే ప్రమాదం ఉందా? అందుకు అధిష్టానం దగ్గర విరుగుడు ఉందా? లేక వాళ్ళవల్ల ఏమవుతుందని లైట్ తీసుకుంటారా? అలిగిన నేతలు ఎవరు? పార్టీ బై పోల్ వ్యూహం ఏంటి? ఉప ఎన్నిక... జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్‌లో అసంతృప్తులకు ఆజ్యం పోస్తోందట. సిట్టింగ్ సీటును తిరిగి నిలబెట్టుకోవాలన్న ..మిగతా 2లో

# ఏ క్షణమైనా నోటిఫికేషన్!

**మొదటిపేజీ తరువాయి**

నిర్ధారించారు. స్థానిక సంస్థల్లో మహిళల కు 50 రిజర్వేషన్ ప్రకారం.. 31 జడ్పీల్లో 15 స్థానాలను మహిళలకు కేటాయించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ డైరెక్టర్ శనివారం గెజిట్ కూడా విడుదల చేశారు. జడ్పీల రిజర్వేషన్ల గెజిట్ కాపీ అందగా, జిల్లావారీగా జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డుసభ్యుల రిజర్వేషన్ల గెజిట్ కాపీలు అందాల్సి ఉన్నది. ఇవన్నీ రాష్ట్ర ఎన్నికల కమిషన్(ఎస్ఈసీ)కు చేరగానే, నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉన్నది.

**తొలుత ఎంపీటీసీ ఎన్నికలు**

స్థానిక సంస్థల ఎన్నికలను మొత్తం మూడు దశల్లో బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలని ఎస్ఈసీ నిర్ణయించింది. తొలుత ఎంపీటీసీ ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ప్రభుత్వం నుంచి ఎన్నికలకు సంబంధించిన అన్ని నివేదికలు అందిన వెంటనే నోటిఫికేషన్ రిలీజ్ చేసేందుకు అవసరమైన ప్రక్రియలను పూర్తిచేసే పనుల్లో ప్రస్తుతం ఎస్ఈసీ తలమునలై ఉన్నట్టు సమాచారం. ఇక కోర్టుల్లో కేసులను సైతం ఎన్నికల కమిషన్ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు తెలిసింది. రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్‌ను వచ్చే నెల 8వ తేదీకి వాయిదా వేసిన హైకోర్టు వ్యాఖ్యలను కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు సమాచారం.

**ఉన్నతాధికారులతో ఎస్ఈసీ కీలక సమావేశం**

స్థానిక సంస్థల ఎన్నికలపై శనివారం రాష్ట్ర ఎన్నికల సంఘం (టీజీఎస్ఈసీ) కీలక సమావేశం నిర్వహించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదినీ నిర్వహించిన సమావేశానికి సీఎస్ రామకృష్ణారావు, అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, పంచాయతీరాజ్, ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్యదర్శులు ఎన్ శ్రీధర్, సందీప్‌కుమార్ సుల్తానియా, ఎక్సైజ్‌శాఖ కమిషనర్ హరికిరణ్ తదితరలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై పంచాయతీరాజ్, పోలీస్, ఎక్సైజ్ శాఖల నివేదికలను ఎలక్షన్ కమిషన్ తీసుకున్నది. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీలోపు స్థానిన సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నది. కానీ, తాజా పరిణామాల నేపథ్యంలో హైకోర్టు విధించిన డెడ్‌లైన్‌లోగా ఎన్నికలు పూర్తిచేసే పరిస్థితి లేదు. కావున ఆ లోపు కనీసం నోటిఫికేషన్ ప్రకటించి, ఎన్నికల ప్రక్రియను ప్రారంభించామని, వచ్చే నెలాఖరులోపు పూర్తిచేస్తామని, ఆ మేరకు అనుమతి ఇవ్వాలని హైకోర్టుకు విన్నవించేలా రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం చెప్పాలని చూస్తున్నట్టు తెలిసింది.

# బీసీసీఐ కొత్త అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్

- బీసీసీఐ కొత్త బాస్‌గా మాజీ క్రికెటర్
- రోజర్ బిన్నీ స్థానంలో మిథున్ మన్హాస్ ఏకగ్రీవంగా ఎన్నిక
- వార్షిక సర్వసభ్య సమావేశంలో కీలక నిర్ణయం
- అధ్యక్ష పదవి చేపట్టిన మూడో మాజీ క్రికెటర్‌గా గుర్తింపు
- మరోసారి వైస్ ప్రెసిడెంట్‌గా రాజీవ్ శుక్లా



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నూతన అధ్యక్షుడిగా మాజీ క్రికెటర్ మిథున్ మన్హాస్ ఎన్నికయ్యారు. ఆదివారం బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో (ఏజీఎం) ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. సౌరవ్ గంగూలీ, రోజర్ బిన్నీల తర్వాత ఈ అత్యున్నత పదవిని అలంకరించిన మూడో మాజీ క్రికెటర్‌గా 45 ఏళ్ల మన్హాస్ నిలిచారు. గత ఆగస్టు నెలలో రోజర్ బిన్నీ తన పదవికి రాజీనామా చేయడంతో బీసీసీఐ అధ్యక్ష పదవి ఖాళీ అయింది. అప్పటి నుంచి రాజీవ్ శుక్లా తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మిథున్ మన్హాస్ పేరును జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ (జేకేసీఏ) నామినేట్ చేసింది. అతడి పేరు అనూహ్య రీతిలో తెరపైకి వచ్చింది. ఇటీవల బోర్డు సమావేశం అనంతరమే మిథున్ మన్హాస్ కూడా ఈ రేసులోకి వచ్చాడు. తాజాగా ఏజీఎంలో ఆయన ఎన్నికను ఖరారు చేశారు. ఇదే సమావేశంలో ఇతర కీలక పదవులకు కూడా ఎన్నికలు జరిగాయి. సమాచారం ప్రకారం, వైస్ ప్రెసిడెంట్‌గా రాజీవ్ శుక్లా, కార్యదర్శిగా దేవాజిత్ సైకియా తమ పదవులను నిలబెట్టుకున్నారు. సంయుక్త కార్యదర్శిగా ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా, కోశాధికారిగా రఘురామ్ భట్ కొత్తగా ఎన్నికయ్యారు. మిథున్ మన్హాస్ నియామకంపై కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా హర్షం వ్యక్తం చేశారు. "ఇది ఒక చారిత్రక సందర్భం! జమ్మూకశ్మీర్‌లోని మారుమూల ప్రాంతమైన దోడా జిల్లాకు చెందిన మిథున్ మన్హాస్ బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నికవడం గర్వకారణం" అని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీ తరఫున దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన రికార్డు ఉన్న మన్హాస్, ఆ తర్వాత జమ్మూకశ్మీర్ జట్టుకు కూడా ప్రాతినిధ్యం వహించి కోచ్‌గా సేవలు అందించారు. తన కెరీర్‌లో 147 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి 9,714 పరుగులు చేశారు. ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్, పుణె వారియర్స్ ఇండియా, చెన్నై సూపర్ కింగ్స్ జట్లకు ఆడారు. క్షేత్రస్థాయిలో క్రికెట్‌పై ఉన్న అవగాహన, సౌమ్యుడిగా పేరున్న మన్హాస్ నియామకం భారత క్రికెట్‌కు మేలు చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# విద్యా రంగంలో కొత్త అధ్యాయం

- సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ వరం
- వర్సిటీతో తెలంగాణ యువతకు విద్యా అవకాశాలు
- రూ.24 కోట్లతో 8.4 కి.మీ ప్రహరీ నిర్మాణం
- పనులు ప్రారంభించిన మంత్రి సీతక్క




**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉన్నత విద్యా అవకాశాలు అందుతాయని, విద్యా రంగంలో కొత్త అధ్యాయం సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ సృష్టిస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో గట్టమ్మ గుట్ట వద్ద సమ్మక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ విశ్వవిద్యాలయం కోసం 24 కోట్ల నిధులతో 8.4 కిలోమీటర్ల ప్రహరీ గోడ నిర్మాణ పనులను మహబూబాబాద్, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, జి నాగేష్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ లతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సమ్మక్కసారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుతో ములుగు జిల్లాకు ప్రత్యేక గౌరవం లభిస్తుందని, గిరిజన విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి ఇది బలమైన వేదిక అవుతుందని అన్నారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ గిరిజన సంక్షేమం పట్ల కట్టుబడి ఉందని యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక వసతులను సమకూర్చుతామని తెలిపారు. యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉన్నత విద్యా అవకాశాలు అందుతాయని, విద్యా రంగంలో కొత్త అధ్యాయం సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ సృష్టిస్తుందని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల కోసం ఆధునిక లైబ్రరీలు, ల్యాబరేటరీలు, హాస్టల్స్, తరగతి గదులు ఏర్పాటు చేయడం జరుగుతుందని, స్థానిక విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని అన్నారు. ప్రజా ప్రభుత్వం గిరిజన సంక్షేమం, విద్యా అవకాశం కోసం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయడం విద్యా రంగంలో కొత్త మైలురాయిని సృష్టిస్తుందన్నారు.

ఈ సందర్భంగా మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటు కాబోతున్న సమ్మక్కసారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీలో 80 శాతం స్థానిక విద్యార్థులకు ప్రవేశ అవకాశాలు కల్పించడం జరుగుతుందని, యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా ప్రాంతీయ ప్రతిభను వెలికి తీయడానికి ముఖ్యమైన వేదికగా మారుతుందని అన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు జి. నాగేష్ మాట్లాడుతూ.. 24 కోట్ల రూపాయలతో ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలోని గిరిజనుల విద్యాభివృద్ధి కోసం వారి సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికి తెలియజేసేలా, ఆర్థిక అభివృద్ధిలో కూడా యూనివర్సిటీ ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు. త్వరలోనే క్యాంపస్ నిర్మాణం విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, తెలంగాణ ప్రాంతానికి సెంట్రల్ గిరిజన యూనివర్సిటీని మంజూరు చేసిన దేశ ప్రధాని, స్థానిక కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి లకు ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ లో రాబోయే ఐదు సంవత్సరాలలో 3 వేల నుంచి 5 వేల మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించనున్నారని అన్నారు. టాస్క్ సెంటర్ ద్వారా కూడా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి పెంచే విధంగా చూస్తున్నామని పేర్కొన్నారు. సెంట్రల్ గిరిజన యూనివర్సిటీలో ప్రస్తుతానికి 42 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, కేంద్ర ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని ఇతర రాష్ట్రాల గిరిజన విద్యార్థులు కూడా ఇక్కడ యూనివర్సిటీలో ప్రవేశాలు పొందడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మాజీ పార్లమెంట్ సభ్యులు సీతారామ్ నాయక్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో అలకలు

**మొదటిపేజీ తరువాయి**

టార్గెట్‌తో.. ఇప్పటికే డివిజన్ల వారీగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ఇన్చార్జులుగా పెట్టింది పార్టీ. అన్ని పార్టీల కంటే ముందుగానే అభ్యర్థిని ప్రకటించేసింది. సెంటిమెంట్ వర్కౌట్ అవుతుందన్న అంచనాతో.. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య సునీతకే టికెట్ కన్ఫామ్ చేసింది. అయితే.. అసలు ట్విస్ట్ ఇక్కడే మొదలైంది. మాగంటి కుటుంబాన్ని సపోర్ట్ చేయాలని ఓవైపు కేటీఆర్ చెబుతున్నా.. మరోవైపు కొంతమంది నేతలు అలకపాన్పు ఎక్కేశారట. ఈ ఉప ఎనికల్లో ఎలాగైనా పోటీ చేయాలి అనుకుని టిక్కెట్ ఆశించిన వాళ్ళు.. ఇక టిక్కెట్ రాదని తెలిశాక.. డివిజన్ మీటింగ్స్‌లో కూడా కనిపించడం లేదని చెప్పుకుంటున్నాయి బీఆర్ఎస్ వర్గాలు. ప్రధానంగా గతంలో ఇదే జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా పనిచేసిన విష్ణు వర్ధన్ రెడ్డి టికెట్ ఆశించారు. ఇక టికెట్ రాదని అర్థమయ్యాక విష్ణు ముఖం చాటేసినట్టు తెలుస్తోంది. డివిజన్ మీటింగ్ సమయంలో కేటీఆర్... విష్ణువర్ధన్ రెడ్డి గురించి చెబుతూ... మాగంటి గోపీనాథ్ కూతుళ్లు తనకు రాఖీ కట్టారని ఆ కుటుంబానికి అండగా ఉంటానని అన్నారని గుర్తు చేశారు. దీంతో విష్ణు.... మాగంటి కుటుంబాన్ని సపోర్టు చేస్తారని అందరూ భావిస్తున్నారు. కానీ..ప్రస్తుతానికి ఆయన కొంత దూరం పాటిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. అయితే, అదంతా తాత్కాలికమేనని, కేటీఆర్ నచ్చజెబితే అంతా సెట్ అవుతుందని భావిస్తోంది బీఆర్ఎస్ కేడర్. మాగంటి మరణం తర్వాత రావుల శ్రీధర్ రెడ్డి కూడా ఇక్కడ టికెట్ ఆశించారు. మాగంటి గోపీనాథ్ సంతాప సభలలో కూడా కీలకంగా పాల్గొన్నారాయన. తర్వాత వినాయక చవితి ఉత్సవాల సమయంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం మొత్తం గట్టిగా తిరిగారు శ్రీధర్ రెడ్డి. ఇక పార్టీ టికెట్ మాగంటి సునీత కు కన్ఫర్మ్ అయ్యాక ఆయన కూడా నియోజకవర్గంలో ఎక్కడా కనిపించడం లేదు.అయితే,, కేటీఆర్‌కి సన్నిహితంగా ఉండే శ్రీధర్ రెడ్డి ఆయన చెప్తే మళ్ళీ యాక్టివ్ అవుతారని అంటున్నారు మాగంటి అనుచరులు. ఇదంతా ఒకవైపు ఉంటే మాగంటి గోపీనాథ్ కుటుంబంలో కూడా ఈ టికెట్ పై పెదవి విరిచినట్టుగా ప్రచారం జరుగుతోంది. స్వయానా గోపీనాథ్ అన్న వజ్రనాథ్ కూడా ఇక్కడి నుంచి బిఆర్ఎస్ తరపున పోటీ చేయడానికి ఒక దశలో సిద్ధమయ్యారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఫ్లెక్సీలు పోస్టర్లతో హడావుడి చేశాడు. ఆ తర్వాత మాగంటి సునీతకు టికెట్ రావడంతో ఆయన కూడా అలిగినట్టుగా ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ఇవాళ తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ని కలవడానికి వచ్చారు వజ్రనాథ్. దీంతో ఆయన కూడా సునీతకు సపోర్ట్ చేస్తారని భావిస్తోంది కేడర్. అధికార కాంగ్రెస్ పార్టీ మీద వ్యతిరేకత ఉంది కాబట్టి.. అది తమకు అడ్వాంటేజ్ అవుతుందన్నది గులాబీ నేతల లెక్క అట. గెలుపు గ్యారంటీ ఉంది కాబట్టే.. తమ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీలు పడుతున్నట్టు చెబుతున్నారు వాళ్ళు. అందరికంటే ముందుగా అభ్యర్థిని ప్రకటించిన బి ఆర్ ఎస్ అధిష్టానం ఈ అలకల వ్యవహారాల్ని కూడా త్వరలోనే సెట్ చేస్తుందని అంటున్నారు ఆ పార్టీ నాయకులు. అయితే, వాళ్ళలో ఎంతమంది పూర్తిగా ట్రాక్‌లోకి వచ్చి పార్టీ అభ్యర్థికి సపోర్ట్ చేస్తారన్నది చూడాలంటున్నారు పొలిటికల్ పరిశీలకులు.



# పదేళ్లు నాకు అవకాశం ఇవ్వండి

**మొదటిపేజీ తరువాయి**

ఉండిపోవాలి? అలాంటి ప్రపంచ స్థాయి నగరాన్ని మన తెలంగాణలో ఎందుకు నిర్మించుకోలేం?" అని ప్రశ్నించారు. ప్రజలు తనకు అవకాశం ఇస్తే, పదేళ్లలోనే ఆ కల సాకారం చేసి చూపిస్తానని అన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మరో 70 ఏళ్ల తర్వాత కూడా ప్రపంచం మొత్తం తెలంగాణ వైపు చూసేలా చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై వస్తున్న విమర్శలపైనా ఆయన స్పందించారు. "కొందరు ఈ ప్రాజెక్ట్‌ను నా వ్యక్తిగత ఆస్తుల కోసం చేస్తున్నానని అనవసర ఆరోపణలు చేస్తున్నారు. ఇది అవాస్తవం. ఇది నా కోసం కాదు, మన పిల్లల భవిష్యత్తు కోసం నిర్మిస్తున్న నగరం" అని ఆయన గట్టిగా చెప్పారు. గతంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖర రెడ్డి లాంటి నాయకులు దూరదృష్టితో ఆలోచించడం వల్లే ఈరోజు తెలంగాణలో హైటెక్ సిటీ, శంషాబాద్ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని గుర్తుచేశారు. గత పాలకుల నుంచి మంచిని స్వీకరించి ముందుకు సాగాలన్నదే తన విధానమని తెలిపారు. ఈ ఫ్యూచర్ సిటీలో బుల్లెట్ రైళ్లు, అత్యాధునిక రవాణా వ్యవస్థలు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, ప్రపంచ స్థాయి విద్యా, వైద్య సంస్థలు ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానికంగా వేలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని హామీ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం విజయవంతం కావడానికి స్థానిక ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రాజెక్ట్ తెలంగాణ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో కేటీఆర్ కొత్త అస్త్రం

**మొదటిపేజీ తరువాయి**

నేతలతో కలిసి కేటీఆర్ విస్తృతంగా పర్యటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మోసపూరిత హామీలను గుర్తుచేసేందుకే ఈ ప్రచారం చేపట్టామని కేటీఆర్ తెలిపారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన ప్రజలను కోరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలను 700 రోజులు గడిచినా కాంగ్రెస్ పట్టించుకోలేదని తీవ్రంగా విమర్శించారు. "మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న పథకం కింద ప్రతి మహిళకు ప్రభుత్వం రూ. 55,000 బాకీ పడింది. అలాగే, వృద్ధులకు రూ. 4,000 పింఛను పథకం కింద ఒక్కొక్కరికి రూ. 44,000 అప్పు ఉంది. ఈ అప్పులన్నింటినీ గుర్తు చేయడానికే ఈ బాకీ కార్డుల ఉద్యమం" అని వివరించారు. పర్యటనలో భాగంగా స్థానికులు తమ సమస్యలను



కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పారిశుధ్యం లోపించిందని, చెత్త పేరుకుపోతోందని, మురుగునీరు నిలిచిపోతోందని, కరెంట్ కోతల వల్ల ఇన్వర్టర్లు కొనుక్కోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నాయి. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్, కాంగ్రెస్ పాలన తీరుపై విరుచుకుపడ్డారు. "ప్రస్తుత నగరం వరదల్లో మునిగిపోతుంటే, ప్రజలు దోమలతో బాధపడుతుంటే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఫ్యూచర్ సిటీ' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు" అని ఆయన ఎద్దేవా చేశారు. నిధుల కొరతపై మహబూబ్‌నగర్, ఎల్లారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలే స్వయంగా ఆందోళన వ్యక్తం చేయడమే వారి పాలనకు నిదర్శనమని అన్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అర్ధాంగి సునీతను ఆశీర్వదించి గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

# గ్రూప్–2 తుది ఫలితాలు విడుదల

- మొత్తం 783 ప్రభుత్వ ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తి
- 5.5 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా తుది జాబితా ప్రకటన
- దసరా పండుగలోపే నియామక పత్రాలు అందించేందుకు ఏర్పాట్లు
- పరీక్షల తర్వాత 10 నెలల్లోనే ఫలితాలు ఇచ్చామన్న టీజీపీఎస్సీ చైర్మన్




**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణలో గ్రూప్2 ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న లక్షలాది మంది అభ్యర్థుల నిరీక్షణకు తెరపడింది. 2022 నోటిఫికేషన్‌కు సంబంధించిన 783 గ్రూప్2 పోస్టుల తుది ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నేడు ప్రకటించింది. ఇందులో ఒక పోస్టు భర్తీ కాలేదు. టీజీపీఎస్సీ తాజా ప్రకటనతో ఎంపికైన అభ్యర్థుల కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది. 2024 డిసెంబర్ 15, 16 తేదీల్లో జరిగిన రాత పరీక్షలకు సుమారు 2.5 లక్షల మందికి పైగా హాజరయ్యారు. ఈ ఏడాది మార్చి 11న జనరల్ ర్యాంకింగ్ జాబితాను విడుదల చేసిన కమిషన్, ఆ తర్వాత ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు పూర్తి చేసింది. అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్లు, మెరిట్ ర్యాంకులు, రిజర్వేషన్ల ఆధారంగా తుది మెరిట్ జాబితాను రూపొందించింది. ఈ పరీక్షల్లో 600 మార్కులకు గాను అత్యధికంగా 447.08 మార్కులు నమోదైనట్లు కమిషన్ వెల్లడించింది. ఈ నోటిఫికేషన్ ద్వారా అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్, సబ్‌రిజిస్ట్రార్ గ్రేడ్II, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్III, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వంటి కీలక పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎంపికైన వారికి దసరా పండుగకు ముందే నియామక పత్రాలు అందజేయాలని కమిషన్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఫలితాల విడుదలపై టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, పరీక్షలు నిర్వహించిన 10 నెలల వ్యవధిలోనే తుది ఫలితాలు ఇచ్చామని, గ్రూప్1 వివాదం లేకపోయి ఉంటే ఫలితాలు మరింత తొందరగా వచ్చేవని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా, కట్‌ఆఫ్ మార్కుల వివరాలు అధికారిక వెబ్‌సైట్ tspsc.gov.in లో అందుబాటులో ఉన్నాయని, అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్‌తో ఫలితాలను చూసుకోవచ్చని కమిషన్ సూచించింది.




# టీమిండియా థ్రిల్లింగ్ విక్టరీ

**దుబాయ్, ప్రజాస్వరం :**

ఆసియా కప్ 2025లో భారత జట్టు ఛాంపియన్‌గా అవతరించింది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 5 వికెట్ల తేడాతో టీమిండియా అద్భుత విజయం సాధించింది. బౌలింగ్‌లో కుల్దీప్ యాదవ్ మాయాజాలం చేయగా, బ్యాటింగ్‌లో యువ ఆటగాడు తిలక్ వర్మ అజేయ హాఫ్ సెంచరీతో జట్టును విజయతీరాలకు చేర్చాడు. 147 పరుగుల ఛేజింగ్ లో టీమిండియా 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 150 పరుగులు చేసింది.147 పరుగుల సాధారణ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అభిషేక్ శర్మ (5), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (1), శుభ్‌మన్ గిల్ (12) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 20 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో తిలక్ వర్మ (69 నాటౌట్), సంజూ శాంసన్ (24)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. శాంసన్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే (33)తో కలిసి తిలక్ వర్మ కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. దూబే కేవలం 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో వేగంగా ఆడి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. చివర్లో దూబే ఔటైనా, తిలక్ వర్మ సంయమనంతో ఆడి జట్టును గెలిపించాడు. పాక్ సీనియర్ పేసర్ హరీస్ రవూఫ్ విసిరిన చివరి ఓవర్లో టీమిండియా విజయానికి 10 పరుగులు అవసరం కాగా... తిలక్ వర్మ ఓ సిక్సర్ కొట్టడంతో మ్యాచ్ భారత్ వైపు మొగ్గింది. రింకూ సింగ్ విన్నింగ్ షాట్ గా ఫోర్ కొట్టడంతో భారత్ టోర్నీ విజేతగా అవతరించింది. అంతకు ముందు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్... పాకిస్థాన్‌ను కట్టడి చేసింది. పాక్ ఓపెనర్లు సాహిబ్జాదా ఫర్హాన్ (57), ఫఖర్ జమాన్ (46) రాణించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముఖ్యంగా భారత స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 4 ఓవర్లలో 30 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి పాక్ పతనాన్ని శాసించాడు. అతనికి తోడుగా జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలా రెండు వికెట్లు తీయడంతో పాకిస్థాన్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్ల సమష్టి ప్రదర్శన, ఆ తర్వాత తిలక్ వర్మ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో టీమిండియా ఆసియా కప్‌ను కైవసం చేసుకుంది. భారత్ ఆసియా కప్ గెలవడం ఇది 9వ సారి కావడం విశేషం. కాగా, ఈసారి ఆసియా కప్ లో భారత్, పాకిస్థాన్ జట్లు మూడు సార్లు తలపడగా, అన్నింటా భారత జట్టే విజయం సాధించింది. ఆసియా కప్ చరిత్రలో భారత్‌పాక్ జట్లు ఫైనల్ లో తలపడడం ఇదే మొదటిసారి కాగా, భారత్ తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.





# చెరువులపై కన్నేస్తే తాట తీస్తా

**మొదటిపేజీ తరువాయి**

కాలేదు.. కొంతమందికి అర్థయినా వారి భూముల కబ్జాలు బయటపడుతాయని వ్యతిరేకించారని తెలిపారు. ఆదివారం అంబర్‌పేటలో పర్యటించిన రేవంత్.. బతుకమ్మకుంట ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. స్వయంగా మొదటి బతుకమ్మను కుంటలో వదిలి బతుకమ్మకుంటను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత వాతావరణంలో అనేక మార్పులు వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేవలం 2 సెంటిమీటర్ల వర్షాన్ని తట్టుకునే విధంగా గత పాలకులు హైదరాబాద్ స్ట్రక్చర్ నిర్మాణం చేశారని తెలిపారు. హైదరాబాద్ ఒకప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్మించుకున్నదని చెప్పుకొచ్చారు. కానీ.. ఇప్పుడు ఒక్క గంటలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు అవుతుందని వివరించారు. ఆనాడు నగర ప్రజలను కాపాడుకోవడానికి మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన ప్రణాళికే మూసీ నది అని గుర్తు చేశారు. కానీ.. కబ్జాల పర్వంలో చెరువులు, నదులను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అందుకే ప్రభుత్వం, హైడ్రా ఉక్కుపాదంతో తాటతీస్తోందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మూసీ నది అభివృద్ధి, తన సొంత లాభం కోసం కాదని పేర్కొన్నారు. పేద ప్రజలను ఇబ్బంది పెట్టడం తన ఉద్దేశం కాదని వివరించారు. మూసీ ఉప్పొంగినప్పుడు MGBS మునిగిపోయిందని తెలిపారు. ఇక్కడ ఒక నాయకుడు కబ్జా పెట్టారని మండిపడ్డారు. అతని పేరు చెప్పాల్సిన అవసరం లేదని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలకు అంతీతంగా కాలేరు వెంకటేష్ పనులు చేయాలని తనని కోరారని చెప్పుకొచ్చారు. అలాగే అందరూ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ పనులు తన దృష్టికి తెచ్చి పనులు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరిక మేరకు హనుమంతరావు పేరు పెట్టడంలో తనకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. బతుకమ్మకుంట కోసం హనుమంతరావు జీవిత ఆశయంగా పోరాటం చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు అంబర్‌పేట బతుకమ్మ కుంటకు వీహెచ్ పేరు పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. తుమ్మిడికుంట కబ్జా చేసి Nకన్వెన్షన్ నిర్మించారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తెలిసో.. తెలీకో.. చెరువున్న చోట హీరో నాగార్జున కన్వెన్షన్ హాల్ కట్టారని తెలిపారు. హైడ్రా కూల్చివేసి వివరాలు చెప్పాక నాగార్జున వాస్తవం గ్రహించారని చెప్పుకొచ్చారు. కబ్జా చేసిన రెండెకరాలను ప్రభుత్వానికి ఇచ్చేశారని పేర్కొన్నారు. చెరువుల బాగు కోసం సహకరిస్తానని నాగార్జున హామీ ఇచ్చినట్లు సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఆట మైదానంలో 'ఆపరేషన్ సిందూర్'

- **ఇక్కడ కూడా మనదే గెలుపు**
- **టీమిండియా విక్టరీపై ప్రధాని మోదీ స్పందన**

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**



ఆసియా కప్ ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ పై భారత క్రికెట్ జట్టు సాధించిన విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనదైన శైలిలో స్పందించారు. టీమిండియా ఆటగాళ్లకు అభినందనలు తెలుపుతూ ఆయన చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తన అభినందన సందేశంలో 'ఆపరేషన్ సిందూర్' అనే పదాన్ని ప్రయోగించడం విశేషం. క్రీడా మైదానంలో భారత జట్టు చూపిన అద్భుత ప్రదర్శనను ప్రశంసిస్తూ ప్రధాని మోదీ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "ఆట మైదానంలో ఆపరేషన్ సిందూర్.. ఎక్కడైనా ఫలితం ఒక్కటే భారత్ విజేత!" అని ఆయన పేర్కొన్నారు. ఈ విజయం సాధించిన మన క్రికెటర్లకు అభినందనలు అంటూ తన పోస్టును ముగించారు. సాధారణంగా భారత జట్టు కీలక విజయాలు నమోదు చేసినప్పుడు ప్రధాని మోదీ అభినందనలు తెలపడం పరిపాటి. అయితే ఈసారి కాస్త వినూత్నంగా, ఒక ప్రత్యేకమైన పదాన్ని ఉపయోగించి శుభాకాంక్షలు చెప్పడం చర్చనీయాంశంగా మారింది. భారత విజయాన్ని 'ఆపరేషన్ సిందూర్' తో పోల్చడం ద్వారా గెలుపు ప్రాధాన్యతను ఆయన చెప్పకనే చెప్పారు. ఈ విజయం పట్ల దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తుండగా, ప్రధాని అభినందనలు జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. దుబాయ్ లో ఆదివారం నాడు రోమాంఛకంగా సాగిన ఆసియా కప్ ఫైనల్లో భారత్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన పాక్ 19.1 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌట్ అయింది. 147 పరుగుల లక్ష్యఛేదనలో భారత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసి విజయభేరి మోగించింది. ఈ విజయంలో తెలుగు ఆటగాడు తిలక్ వర్మ 69 పరుగులతో అజేయంగా నిలిచి కీలక పాత్ర పోషించాడు.





# దౌల్తాబాద్‌లో ఆర్.ఎస్.ఎస్ దసరా ఉత్సవాలు

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 28( ప్రజాస్వరం ):**

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ దసరాఉత్సవాలు శనివారం రాత్రి స్థానిక ధర్మశాలలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి మెదక్ జిల్లా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యవాహ విభాగ్ బోళ్ల .నాగభూషణం, ముఖ్య అతిథి బ్యాగరి.శంభులింగంలు హాజరై స్వయంసేవకులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు వేరువేరుగా మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక సంఘం స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో దేశవ్యాప్తంగా దసరా ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, సామాజిక సేవల పరిరక్షణలో సంఘం పోషించిన పాత్ర అపారమని గుర్తు చేశారు. గత శతాబ్దంలో సహజ విపత్తులు, కష్టకాలాల్లో దేశంలోని ప్రతి మూలకు చేరి సేవ చేసిన అనేక ఉదాహరణలు ఉన్నాయని చెప్పారు. అలాగే మనమంతా ఒకే భారతీయులమన్న భావనను మరవకూడదని, దేశం పట్ల ప్రతి ఒక్కరి కర్తవ్యాన్ని గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. స్వదేశీ ఆలోచన, సంస్కృతి పరిరక్షణ, సమాజంలో సమగ్రత తీసుకురావడమే సంఘం ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. యువతలో జాతీయతా భావం పెంపొందించడానికి ఇలాంటి ఉత్సవాలు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కనక రాములు పద్మిని ప్రభుకుమార్,ఆంజనేయులు, లోతమండ రమేష్ గౌడ్, రజనీకాంత్ గౌడ్, జర్నలిస్టు ముద్ర కోల్ల యాదగిరి,జోడు కరుణాకర్, స్వామి గౌడ్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**గజ్వేల్ (ప్రజాస్వరం) :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ శివాలయం కాలనీలో గత వారం రోజులుగా కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్ మమత దంపతుల సౌజన్యంతో కాలనీవాసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలలో భాగంగా ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఆట పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అలాగే అందరికీ జ్యూట్ బ్యాగులు అందజేశారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన లైన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్ లయన్ అమర్నాథ్ రావు మాట్లాడుతూ అందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపి, లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా




పర్యావరణ పరిరక్షణ కోసం లయన్స్ క్లబ్ పాటుపడుతుందని, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో బతుకమ్మ సంబరాలు నిర్వహించడం జరుగుతుందని, గజ్వేల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఇంత చక్కటి కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు, ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పెద్ద ఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు



# నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు

- **కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**

**పెద్దపల్లి,సెప్టెంబర్28(ప్రజా స్వరం):**

నేడు పెద్దపల్లి కలెక్టరేట్లో సోమవారం నాడు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్ కు రావద్దని విజ్ఞప్తి చేశారు.సద్దుల బతుకమ్మ పండుగ ఏర్పాట్ల నేపథ్యంలో అధికారులంతా క్షేత్రస్థాయిలో విధులలో ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పండుగ పూట విషాదం

- **ట్రాలీ ఢీకోని బాలుడు మృతి**

**ముత్తారం/పెద్దపల్లి,(ప్రజా స్వరం):**

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో పండుగ పూట విషాదం నెలకొంది.మండల కేంద్రంలోని కాసర్లగడ్డ బస్టాండ్ వద్ద ట్రాలీ ఢీకొని బాలుడు మృతి చెందాడు.ఆదివారం సాయంత్రం కాసర్లగడ్డ వద్ద టీ షాపు నడుపుతున్న తిరునహరి శ్రీనివాస్‌మంజుల కుమారుడు సిద్దార్థ(2) టీ షాప్ వద్ద ఉండగా అడవి శ్రీరాంపూర్ కు చెందిన ట్రాలీ ఆటో బాలుడిని ఢీకోంది.గమనించిన కుటుంబ సభ్యులు,స్థానికులు వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు.అప్పటి వరకు ఆడుకున్న కన్నకొడుకు కళ్ళ ముందే ట్రాలీ ఢీకొని మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.దీంతో ముత్తారంలో విషాద చాయలు నెలకొన్నాయి.



# గాయని వీణ ఆధ్వర్యంలో అమ్మవారి పూజ, భజన,అన్నప్రసాదం

**మేడ్చల్,సెప్టెంబర్ 28: (ప్రజాస్వరం) :**

మేడ్చల్ పట్టణంలో దేవీ నవరాత్రి వేడుకలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మేడ్చల్ మున్సిపాలిటీలో జర్నలిస్ట్ నవీన్ మాత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ పూజ కార్యక్రమంలో తెలంగాణ జనపథ గాయని సింగర్ వీణ భవాని శంకర్ బృందం ఆలపించిన భక్తి పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రముఖ గాయని వీణ మాట్లాడుతూ అమ్మవారి చల్లనిచూపు ప్రజలపై చూపాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతులు పడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ పూజ కార్యక్రమంలో వీణ కుటుంబ సభ్యులు,ప్రమీల,నరేష్ కుమార్,ఝాన్సీ రాణి,నాగరాజు,అనుకి, వియన్,శరన్ తేజ్,శరన్ జీత్, గాయకుడు రమేశ్, విజ్జు(విజయ్) పెద్ద ఎత్తున భవాని మాలదరులు,రవీందర్ రెడ్డి,నర్సింగ్ ముదిరాజ్, అనిల్,ఆనంద్,అఖిల్, ముక్కెర మురళి కృష్ణ,వెంకీ , ప్రజలు పాల్గొన్నారు.



## మానవసేవయే మాధవసేవ

- **మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్.**

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 28 ( ప్రజా స్వరం)**

నిరుపేద ప్రజలకు ఎల్లప్పుడూ కష్టసుఖాలలో అండగా ఉండి తోచిన సహాయం చేస్తూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ అన్నారు. శనివారం రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో నిరుపేదలకు బట్టలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల కోసం తాను ఎన్నో సంవత్సరాల నుంచి అండగా ఉంటూ వారికి పలు రకాల ఆర్థిక సాయం అందించడం జరిగిందని గుర్తు చేశారు. పేద రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం దురదృష్టకరమని విచారణ వ్యక్తం చేశారు. తనతో ఎన్నో సంవత్సరాలుగా సత్సంబంధాలు ఉన్న పలువురు నాయకులు,కార్యకర్తలు అనారోగ్యంతో మృతిచెందడం పట్ల విచారం వ్యక్తం చేస్తూ ఆయా కుటుంబాలకు తగిన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. పేదల కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని పదవి ఉన్న లేకున్నా దుబ్బాక నియోజకవర్గం ప్రజల మధ్యలో ఉంటానని ఆయన స్పష్టం చేశారు. పేదలకు సేవ చేయడం ద్వారానే తనకు ఎంతో సంతృప్తి కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంతూర్ మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి,మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ పర్వీజ్ అహ్మద్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు సంతోష్, సీనియర్ నాయకులు చింతకింది మంజూర్,బాగిరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు



## రూ.28 లక్షలతో సీసీ రోడ్ల పనులను ప్రారంభించిన

- **ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి**

**పరిగి, సెప్టెంబర్ 28(ప్రజా స్వరం):**

పరిగి నియోజకవర్గం దోమ మండలంలోని పలు గ్రామాలలో పరిగి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి అది వారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండలం లోని బొంపల్లి గ్రామంలో రూ.14 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను, అలాగే బాస్పల్లి గ్రామంలో రూ.14 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కొత్త బోరు వేయించి స్థానిక నాయకులు,ప్రజలతో కలిసి పూజలు నిర్వహించి బోరును ప్రారంభించారు.







## తెలంగాణ బతుకమ్మ సాంస్కృతిని కాపాడుకుందాం

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 28( ప్రజాస్వరం )**

సంస్కృతి సంప్రదాయాలను మరచిపోతున్న నేటి కాలంలో వాటిని గుర్తు చేయడం పాఠశాల కర్తవ్యంగా భావిస్తూ ప్రాచీన సాంప్రదాయం విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందని ఇందుప్రియాల్ అంగన్వాడి ఉపాధ్యాయురాలు మహమ్మద్ సుల్తాన అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ 3 కేంద్రంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తంగేడు, గునుగు, చామంతి తోపాటు తీరొక్క పూవులతో బతుకమ్మ తయారుచేసి కోలాటాలతో బతుకమ్మ ఆటపాటలతో విద్యార్థులు సందడి చేశారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా తీరొక్క పూవోలే తీసుకువచ్చి పాఠశాలలోనే రంగురంగుల బతుకమ్మలను అందంగా పేర్చి తయారు చేశారు. చిన్నారి విద్యార్థులకు, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను నేర్పించుటకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పాఠశాలలో బతుకమ్మ సంబరాలకు సహకరించిన తల్లిదండ్రులకు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటల్లో పాల్గొన్నవారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బతుకమ్మలను ఆటపాటలతో చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## హాస్టల్ ముందు వర్కర్ల ఆందోళన

- **సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తాం**

**మెదక్ సెప్టెంబర్ 28 (ప్రజా స్వరం)**

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ లో పని చేస్తున్న డైలీ వైజ్ వర్కర్ల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం మెదక్ లోని హాస్టల్ ముందు వర్కర్స్ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా డైలీ వేజెస్ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు దొడ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ 212 జీవో ను సవరించి 2014 నాటికి ఐదేండ్లు సర్వీస్ ఉన్న వారందరిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించేందుకు ట్రెజరీ లకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త మెనూ పెరిగిన పనిభారానికి అనుగుణంగా కార్మికులను పెంచలన్నారు. పూర్తికాలం పనిచేస్తున్న కార్మికులకు పూర్తి వేతనాలు ఇవ్వాలన్నారు. విద్యార్థులతో పాటు కార్మికులకు కూడా రెండు జతల యూనిఫాం, ఐడి కార్డులు ఇవ్వాలన్నారు.కార్మికులకు రూ 10లక్షల ప్రమాద భీమా కల్పించాలని కోరారు. ఏండ్ల తరబడి అనేక సమస్యలతో సతమతమవుతున్నామని, వేంటనే సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం యూనియన్ ప్రధాన కార్యదర్శి జె. సునంద కోశాధికారి ఏ. మాధవి సలహాదారు నూనె శేఖర్ ఉపాధ్యక్షులు డి. సువర్ణ సభ్యులు భూలక్ష్మి,జ్యోతి, పెంటమ్మ,రజిత,కిషన్,సురేష్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందా?

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 28( ప్రజాస్వరం)**

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయలేదు. కానీ ఎన్నికల కోడ్ అప్పుడే అమలులోకి వచ్చిందా..?? లేక గతంలో జరిగిన సాధారణ శాసన సభ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన ఎన్నికల కోడ్ ఇంక అమలులోనే ఉందా..?? అనేది అర్థం కానీ పరిస్థితిలో రాయపోల్ మండల అధికారులు ఉన్నారని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. సాధారణంగా ఎప్పుడైనా ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే అధికారులు రాజకీయ పార్టీల గుర్తులు, జెండాలు, జెండా గద్దెలు, విగ్రహాలు ఏవి ఉన్న ముసుగు వేయడం, కనిపించకుండా తెల్ల రంగు వేయడం జరుగుతుంది. కానీ రాయపోల్ మండల కేంద్రంలో మాత్రం 2023 సాధారణ శాసన సభ, పార్లమెంట్ ఎన్నికలు జరిగి 20 నెలలు గడుస్తున్నా,ఎన్నికల కోడ్ ముగిసిన శిలాఫలకాలకు ముసుగు తొలగించకుండా చోద్యం చూస్తున్న అధికారులు. అధికారులు నిద్రమత్తులో ఉన్నారా ? లేక ఎన్నికల కోడ్ ముగిసిపోలేదని భ్రమలో ఉన్నారా ? లేకపోతే స్థానికి సంస్థల ఎన్నికలు వస్తున్నాయని ముందస్తుగా ఎన్నికల కోడ్ అమలు చేస్తున్నారా అని ఆశ్చర్యంలో ప్రజలు ఉన్నారు.

## అమ్మవారి కృపతో ప్రజలంతా చల్లగా ఉండాలి: జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య

**జవహర్ నగర్, సెప్టెంబర్28(ప్రజాస్వరం):**

అమ్మవారి కృపతో ప్రజలంతా చల్లగా ఉండాలని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ మేకల కావ్య అన్నారు ఆదివారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వారు డివిజన్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేవీ నవరాత్రులు, బతుకమ్మ వేడుకలు మహిళలకు ఎంతో ప్రత్యేకమైన పండుగలు అన్నారు. కార్యక్రమంలో నాయకులు బండ కింది ప్రసాద్ గౌడ్, మేకల భార్గవ్ రామ్, వేణు, యువరాజ్, జలంధర్, బండి నవీన్, కాశీమ్, తదితరులు పాల్గొన్నారు.



## రాయపోల్ రిజర్వేషన్ ఖరార్

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 28( ప్రజాస్వరం)**

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్న తరుణంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించి స్థానిక సంస్థలకు వెళ్లాలని నిర్ణయం మేరకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయడం జరిగింది. దానిలో భాగంగానే శనివారం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో స్థానిక సంస్థల ఎంపీటీసీ, సర్పంచ్ ల పదవులకు రిజర్వేషన్లు డ్రా పద్ధతిలో అధికారులు ఖరారు చేశారు.

**రాయపోల్ మండలం సర్పంచ్ రిజర్వేషన్లు.**

అనాజీపూర్ ఎస్సీ (జనరల్), గొల్లపల్లి ఎస్సీ (మహిళ),రాయపోల్ ఎస్సీ (మహిళా),రామారం ఎస్సీ (జనరల్), అంకిరెడ్డిపల్లి బిసి (జనరల్), బేగంపేట బీసీ (మహిళ),లింగారెడ్డి పల్లి బీసీ (జనరల్),మంతూర్ బిసి (మహిళ),ముంగిసపల్లి బీసీ (మహిళ),తిమ్మక్కపల్లి బీసీ (జనరల్),వడ్డేపల్లి బిసి (జనరల్),ఆరేపల్లి ఎస్ జె అన్ రిజర్వడ్ (మహిళ),చిన్న మాసాన్ పల్లి అన్ రిజర్వడ్ (జనరల్),రాంసాగర్ అన్ రిజర్వడ్ (జనరల్), సయ్యద్ నగర్ అన్ రిజర్వడ్ (మహిళ), టెంకం పేట అన్ రిజర్వడ్ (జనరల్),వీరారెడ్డిపల్లి అన్ రిజర్వడ్ **(మహిళ), ఎల్కల్ -అన్ రిజర్వుడ్ (జనరల్), కొత్తపల్లి-బిసి (మహిళ) గా కేటాయించారు.**

అలాగే మండలంలో ఎంపీటీసీ రిజర్వేషన్స్ స్థానాలు. రాయపోల్ బీసీ (జనరల్),అనాజిపూర్ బీసీ (జనరల్), కొత్తపల్లి ఎస్సీ (జనరల్),మంతూర్ బీసీ (జనరల్),ఎల్కల్ బిసి (మహిళ), రాంసాగర్ జనరల్. రామారం ఎస్సీ (మహిళ),వడ్డేపల్లి జనరల్ (మహిళా) స్థానాలను కేటాయించారు. ఈ రిజర్వేషన్ల ప్రకటనతో గ్రామాల్లో రాజకీయ కదలికలు వేగవంతమయ్యాయి. రాబోయే ఎన్నికల్లో ఎవరెవరు పోటీ చేస్తారన్న దానిపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. అభ్యర్థుల అనుచరులు కూడా వ్యూహరచనలో నిమగ్నమయ్యారు.

## మన్ కీ బాత్ వీక్షించిన గజ్వేల్ బిజెపి నాయకులు

**గజ్వేల్ (ప్రజా స్వరం) :**

ప్రధాని నరేంద్ర మోడీ “మన్ కీ బాత్” కార్యక్రమాన్ని గజ్వేల్ పట్టణంలో ఆర్ అండ్ ఆర్ కాలనీ 196 పోలింగ్ బూత్ బిజెపి అధ్యక్షుడు గుప్తా రామకృష్ణ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణ బిజెపి నాయకులతో కలసి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ వీక్షించారు. . మన్ కీ బాత్ 126వ ఎపిసోడ్ లో ప్రధాని మోదీ దేశ అభివృద్ధి, దేశ వారసత్వ పరిరక్షణ అంశాలపై ప్రసంగించారు. వాటి ప్రాముఖ్యతను వివరించారు.ఈకార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు నత్తి శివకుమార్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి మాడుగురి నరసింహ ముదిరాజ్, బిజెపి సీనియర్ నాయకులు నాగు ముదిరాజ్, నాయకులు అమీర్ శెట్టి వెంకట్ గుప్తా, దుద్దెడ గణేష్, మాడుగురి కరుణాకర్, కుమారస్వామి, రాజేశ్వరి చారి, తుప్పతి నరేష్ తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**మనోహరాబాద్ (ప్రజాస్వరం ) :**

శ్రీ శ్రీ శ్రీ వనదుర్గ కాలకంటి బంగారమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో బిజెపి రాష్ట్ర నాయకులు పురం మహేశ్వర్ ముదిరాజ్, నాయకులు తుమ్మల వెంకటేశ్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఊట్ల సత్యనారాయణ ముదిరాజ్, బిజెపి నాయకులు ఎర్రోళ్ల కృష్ణ, నెతి కుంట సాగర్, నేతి కుంట లక్ష్మణ్ లతోపాటు పలువురు నాయకులు ఆయా గ్రామాల నేతలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు బంగారమ్మ ఆలయం వద్ద ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులు వేణుగోపాల్ శర్మ కు కృతజ్ఞతలు తెలిపారు.



## పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి

- **మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్**

**దౌల్తాబాద్,సెప్టెంబర్ 28( ప్రజాస్వరం) :**

దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ మండల పరిధిలోని గాజులపల్లి, శేరిపల్లి బందారం, లింగాయపల్లి తండాల్లో వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంద మంది వృద్ధులకు దోతులు, అంగీలు అందజేయగా,50 మంది మహిళలకు తువాళ్లను పంపిణీ చేశారు.పండగ సంతోషాన్ని అందరికీ పంచుకోవాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ రహీమొద్దీన్,జనార్ధన్ రెడ్డి, జోడు నవీన్,హరిబాబు,నాగులు,మంగ్యా తదితరులున్నారు.





## దొమ్మాటలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**దౌల్తాబాద్, సెప్టెంబర్ 28( ప్రజాస్వరం) :**

మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో బిఆర్ఎస్ యువజన నాయకుడు నర్రా రాజేందర్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను మాజీ ఎంపీటీసీ గన్నమనేని మోహన్ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ,శారీరక దృఢత్వం,జట్టు భావన పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువత చదువుతో పాటు క్రీడలలోనూ రాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువత, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు.





# బిజెపి ఆధ్వర్యంలో దివ్యాంగులకు వీల్ చైర్ లు పంపిణీ

**జవహర్ నగర్, సెప్టెంబర్ 28,(ప్రజాస్వరం):**

భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అంబేద్కర్ నగర్ లో బిజెపి ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా బిజెపి జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు కార్యక్రమంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఈస్ట్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు కర్లపూడి జోగారావు,ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు మహేందర్ యాదవ్, పచ్చిమ శాఖ కమలాకర్ రాష్ట్ర నాయకులు మైపాల్ రెడ్డి, రంగుల శంకర్, సీనియర్ నాయకులు చంద్రమౌళి, లక్ష్మీనారాయణ, పుణ్యరాజు, సన్నీ, రామ్ నాయక్, జ్ఞానేశ్వర్ గౌడ్,గిరి, కత్తుల వెంకన్న, డాక్టర్ యాదగిరి గారు , అనిల్ గుప్తా విష్ణువర్ధన్ రెడ్డి, మహేందర్ శ్రీధర్, రాజు నేత, కనకరాజు , రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు

# గొడుగుపల్లిలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**దౌల్తాబాద్ సెప్టెంబర్ 28 (ప్రజాస్వరం):**

గొడుగుపల్లి గ్రామంలో ఆదివారం ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని విశేష స్థాయిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో, మంత్రి మల్లేష్ యాదవ్ (ఆర్.ఎం.పి) సహకారంతో, టీం విమలాకర్ రెడ్డి ఫౌండేషన్ సారథ్యంలో "కుంజర యాత్ర" పేరుతో ఈ మెడికల్ క్యాంప్ నిర్వహించబడింది.గ్రామ ప్రజలకు సాధారణంగా అందుబాటులో ఉండని ఆధునిక వైద్య పరీక్షలను ఈ శిబిరం ద్వారా ఉచితంగా అందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రక్తపరీక్షలు, షుగర్ టెస్టులు, ఈసిజి, 2డి ఎకో, అల్ట్రాసౌండ్, ఎండోస్కోపీ వంటి వైద్యపరీక్షలు కార్పొరేట్ స్థాయిలో నిర్వాహకులు అందించారు. పరీక్షల అనంతరం వైద్యులు అవసరమైన వారికి ఉచిత మందులు కూడా పంపిణీ చేశారు. ఉదయం



నుండి సాయంత్రం వరకు శిబిర ప్రాంగణం రద్దీగా మారింది. చిన్నపిల్లల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ క్యాంప్‌లో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవడం జరిగింది. గ్రామంలోనే ఇంత విస్తృత స్థాయి వైద్య సదుపాయాలు ఉచితంగా లభించడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. "కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో చికిత్సలు గ్రామంలోనే లభించడం అరుదైన అవకాశమని" పలువురు గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా డాక్టర్ విమలాకర్ రెడ్డి మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సమయానికి ఆరోగ్య పరీక్షలు జరగకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. ఇలాంటి మెడికల్ క్యాంప్‌లు ప్రజల ఆరోగ్య రక్షణకు ఎంతో దోహదం చేస్తాయి" అని తెలిపారు. క్యాంప్ విజయవంతానికి కృషి చేసిన హనుమాన్ యూత్ ప్రెసిడెంట్ అక్కం శేఖర్, వైస్ ప్రెసిడెంట్ రణం హరీష్ గౌడ్, యూత్ సభ్యులు గ్రామ ప్రజలతో కలిసి సద్వినియోగం చేసుకున్నారు. శిబిరంలో పాల్గొన్న ప్రజలందరికీ అవసరమైన సహకారం అందించడంలో యువత ముందుండటం గ్రామస్తులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విమలాకర్ రెడ్డి అండ్ టీం, ఆర్.ఎం.పి మంత్రి మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మద్దెల స్వామి, శేఖర్, హనుమాన్ యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దౌల్తాబాద్‌లో శరణ్యా నవరాత్రి ఉత్సవాల్లో చాముండేశ్వరి మాత దర్శనం

**దౌల్తాబాద్, సెప్టెంబర్ 28 (ప్రజాస్వరం):**

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో శరణ్య నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఆదివారం శ్రీ దుర్గమ్మ దేవాలయంలో విశేష పూజలు, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించగా, అమ్మవారు చాముండేశ్వరి మాత అవతారంలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు మంగళహారతులు, శతనామావళి, శక్తి పూజలు నిర్వహించి ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలను చేపట్టారు. భక్తులు పూలు, పండ్లు, నైవేద్యాలతో అమ్మవారిని సత్కరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు, భజన బృందాల గానం సాగి భక్తి వాతావరణాన్ని మరింత ఆహ్లాదకరంగా మార్చాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంభారపు నాగరాజు కుటుంబ సభ్యులు, దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ ముత్యం గారి యాదగిరి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాముండేశ్వరి మాత దుర్గాదేవి యొక్క మహాశక్తి స్వరూపమని, చెడును సంహరించి సజ్జనులను రక్షించే శక్తి రూపిణి అని పురాణాలు చెబుతున్నాయని ఆలయ అర్చకులు భక్తులకు వివరించారు. అమ్మవారి రూపాన్ని దర్శించుకున్న భక్తులు ఆనందభరితులయ్యారు. మండల పరిధి అంతటా నుండి భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారి దివ్య దర్శనం పొందారు. నవరాత్రి ఉత్సవాలు అద్భుతంగా కొనసాగుతున్నాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబరపు ఆనంద్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**మాసాయిపేట, (ప్రజా స్వరం) :**

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీ రఘునందన్ రావు సహకారంతో దరఖాస్తు చేసుకున్నారు. దేవుళ్ల ఆనంద్ (పోతాన్ పల్లి) రూ. 33 వేలు, కేతావత్ రజిత లింగం(చెట్ల తిమ్మాయ పల్లి) రూ.16 వేలు మంజూరు కాగా చెక్కులు అందజేశారు. మండల అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, తలారి మల్లేష్, ఆకారం బాబు, రవి కిరణ్, నరేందర్, రాజు, నరేష్, బాలకృష్ణ, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

# వైభవంగా బతుకమ్మ సంబరాలు





**మెదక్, (ప్రజా స్వరం) :**

మెదక్ పట్టణం స్థానిక కోదండ రామాలయంలో బీజేపీ మహిళా మోర్చా ఇంచార్జ్ కవిత రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మ ను పేర్చి, గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో బతుకమ్మ పాటలు పాడుతూ ఆనందోత్సాహాల మధ్య సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా ఇంచార్జ్ కవిత రెడ్డి మాట్లాడుతూ పువ్వులను పూజించే గొప్ప సంప్రదాయం మన తెలంగాణ లో ఉందన్నారు. ఇలాంటి సంప్రదాయం దేశం లో ఎక్కడ లేదని మన బతుకమ్మ ను ఇప్పుడు విదేశాల్లో కూడా ఆడుతూ పాడుతూ ఉండడం సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మండల అధ్యక్షురాలు బెండ వీణ, లావణ్య, కవిత, మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక వ్యవసాయంలో కీలకపాత్ర















- **పరిగి పట్టణంలో ఏటీఎంఏ కమిటీ నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే**

**పరిగి, సెప్టెంబర్ 28(ప్రజా స్వరం) :**

పరిగి పట్టణంలో వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ-(ఏటీఎంఏ) కమిటీ నూతన భవనాన్ని పరిగి ఎమ్మెల్యే , డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానం అందించడంలో ఏటీఎంఏ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ఈ భవనం ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,ఆధునిక వ్యవసాయ పద్ధతులు,ప్రభుత్వ పథకాలపై అవగాహన మరింత సులభంగా అందుతుందని చెప్పారు. జిల్లాలోని మొట్టమొదటి కమిటీ భవనం పరిగిలో నిర్మించడం గర్వకారణమని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే భూమికి భూసార పరీక్షలు చేయించడం ద్వారా పంట దిగుబడి ఎక్కువగా పెరుగుతుందని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖలో అధునాతన పద్ధతులను రైతులు తప్పనిసరిగా తెలుసుకోవాలని పిలుపునిచ్చారు.దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో వరి పంట అధికంగా పండబోతుందని అన్నారు.

# పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత

- **తాండూరు మండలం జింగుర్తి గ్రామంలో**
- **జాతీయ సేవ పథకం ప్రత్యేక శిబిరం**
- **విద్యార్థుల అవగాహన**

**తాండూరు, సెప్టెంబర్ 28(ప్రజా స్వరం):**

వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జింగుర్తి గ్రామంలో ఆదివారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని అన్ని వార్డులలో ఈ ర్యాలీ కొనసాగి, విద్యార్థులు ప్రజల్లో చైతన్యం కలిగించే నినాదాలు చేశారు. "పరిసరాల పరిశుభ్రత మన మనుగడకు భద్రత" "చేయి చేయి కలుపుదాం - పర్యావరణాన్ని కాపాడుదాం" "చీపురుపట్టు చెత్తను నెట్టు - స్వచ్ఛ భారత్ నీ పట్టు - అదే దేశానికి తొలిమెట్టు" "మదకద్రవ్యాలు వద్దు - జీవితం ముద్దు" ఈ నినాదాల ద్వారా విద్యార్థులు గ్రామస్తులను పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ పట్ల చైతన్యవంతులను చేసి, మద్యం మరియు మాదక ద్రవ్యాల వంటి చెడు అలవాట్ల నుండి దూరంగా ఉండాలని ప్రోత్సహించారు. విద్యార్థుల ఉత్సాహభరితమైన భాగస్వామ్యం గ్రామంలో సానుకూల ప్రభావాన్ని చూపించింది. తరువాత, ఏకలవ్య కాలేజీ పరిసర ప్రాంతంలో విద్యార్థులు మరియు అధ్యాపకులు కలిసి పార్థెనియం నిర్మూలన కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా కళాశాల పరిసరాలను శుభ్రపరిచి, శుభ్రమైన, పచ్చదనంతో నిండిన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కాపాడాలని సందేశాన్ని







వ్యాప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్లు డా. నవీన్ కుమార్, డా. కల్పన, డా. శేఖర్, డా. అర్చన, ఏకలవ్య ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎకరానికి రూ.25 వేల పరిహారం ఇవ్వాలి



**తాండూరు సెప్టెంబర్ 28 (ప్రజా స్వరం):**

సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే భారీ వర్షాలకు నష్టపోయిన రైతులని నష్టపరిహారం ఒక ఎకరాకు 25 వేలు ఇచ్చి ఆదుకోవాలని, ఇండ్లు కూలిపోయిన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని భారీ వర్షాలకు తాండూర్ డివిజన్ గ్రామాలలో పంటలు పత్తి పెసరు మినుము కంది వరి, ఉల్లినరు, పంటలు నష్టపోయినటువంటి రైతులకు నష్ట పరిహారం ఎకరానికి 25 వేల రూపాయలు ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు కూలిపోయినటువంటి పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వలన చిలక వాగు తాడూరు పట్టణంలో సక్రమంగా నిర్మించకపోవడం వల్లన అక్రమాలకు కబ్జాలకు గురైనందుకు పేదల ఇండ్లకు నీరు భారీ వర్షాల కారణంగా అనేక ఇళ్లలకు నీరు వచ్చి పేద ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఇండ్లల్లోకు భారీ వర్షం నీరు వచ్చినందుకు వారికి పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడింది అని అన్నారు .కబ్జాల గురైనటువంటి చిలక వాగుని కబ్జాదారుల నుండి ప్రభుత్వం వెంటనే విడిపించి డ్రైనేజీ నిర్మించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తాండూర్ నియోజకవర్గంలో గ్రామాల్లో పేద రైతులు భారీ వర్షాల కారణంగా ఎకరాల పంటలు నష్టపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అనేక గ్రామాలు నీట మునిగినటువంటి పరిస్థితి ఏర్పడింది పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ 25 వేల రూపాయలు ఇవ్వాలని అదేవిధంగా ఇండ్లు కూలిపోయినటువంటి రైతులకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అధికారులు పంట నష్టపోయిన రైతులకు ఇండ్లకు కూలిపోయిన పేద ప్రజలకు వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులు నష్టపరిహారం చెల్లించి వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరదలకు పాడైపోయిన రోడ్లన్నీ వెంటనే బాగు చేయాలని లేకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పంట నష్టపోయిన రైతులని ఇల్లు కూలిపోయిన పేద ప్రజలను అందరిని సమీకరించి పెద్ద ఎత్తున తాండూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. భారీ వర్షం కారణంగా అనేక గ్రామాలు తాండూరు నియోజకవర్గం లో భారీ వర్షం నీరు కారణంగా నీటి మునిగిన పరిస్థితి ఏర్పడింది అని అన్నారు. తాండూర్ పట్టణం తాండూర్ మండలం సంగెంకలాన్ వీరేశేటి పల్లి బషీరాబాద్ మండలం జీవనిగి గ్రామాలని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, జైపాల్, సతీష్, మల్లేష్, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.






# కోకట్ వాగు బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు

**తాండూరు, సెప్టెంబర్ 28 (ప్రజా స్వరం ):**

గత మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు తెగిపోయిన వికారాబాద్ జిల్లా మండలం కోకట్ కాగ్న వాగు బ్రిడ్జికి ఆర్ అండ్ బి అధికారులు ఆదివారం తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. తాండూర్ నుంచి కోకట్ మీదుగా రాస్నం ధరూరు మండలం పరిగి ప్రాంతాల వైపు ప్రయాణానికి అనుకూలంగా ఉన్న కోకట్ కాగ్న బ్రిడ్జి 1988లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రారంభించారు. దాదాపు 38 ఏళ్లుగా ఈ వంతెన యధావిధిగా ఉండిపోయింది. తాండూర్ నియోజకవర్గం నుంచి యాలాల మండలం లోని దాదాపు 15 గ్రామాల ప్రజలకు ఈ కోకట్ బ్రిడ్జి రాకపోకలకు అణువుగా ఉంది. అయితే భారీ వర్షాల కారణంగా బ్రిడ్జి ఒకవైపు భాగం పది మీటర్ల మేర తెగిపోవడంతో శనివారం ఉదయం నుంచి రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. దీంతో యాలాల మండలం బానాపూర్, విశ్వనాథ్ పూర్, రాఘవాపూర్, బాగాయిపల్లి, పగిడ్యాల, ముద్దాయి పేట తదితర గ్రామాల ప్రజలు మండల కేంద్రం మీదుగా అదనంగా 10 నుంచి 20 కిలోమీటర్ల ప్రయాణించి తాండూరు పట్టణానికి చేరుకోవాల్సి వస్తుంది. అయితే శనివారం బ్రిడ్జి కూలిన ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ తో పాటు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పరిశీలించి పరిస్థితి సమీక్షించారు. తాత్కాలికంగా కూలిపోయిన బ్రిడ్జి మరమ్మతు పనులు చేయించాలని తాండూర్ సబ్ డివిజన్ ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించడంతో వారు కాంట్రాక్టర్ చేత ఆదివారం మరమ్మతు పనులు చేయించారు. తాత్కాలిక మరమ్మతులతో రోడ్డు వినియోగంలోకి రావడంతో ఈ మార్గంలో ఆదివారం సాయంత్రం నుంచి రాకపోకలను పునరుద్ధరించారు.

# దుర్గా మాత విగ్రహ ప్రతిష్టాపన, అన్నప్రసాదం వితరణ





**శామీర్‌పేట, సెప్టెంబర్ 28(ప్రజాస్వరం) :**

తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజాల్ లో దసరా నవరాత్రుల సందర్భంగా దుర్గా నవరాత్రి కమిటీ ఆధ్వర్యంలో దుర్గా మాత విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. సోమవారం సింగం డాక్టర్ రామరావు వారి కుమారులు మనోహర్, నవీన్ కుమార్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, అల్వాల్ సొసైటీ డైరెక్టర్ నాలుక యాదగిరి, జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, శ్రీ సీతారామ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దాసరి గోపాల్ రెడ్డి, మాజీ ధర్మకర్త పట్నం నర్సింహా రెడ్డి, స్థానికులు శ్రావంత్ రెడ్డి, పొట్టోల ఆనంద్, మద్దూరి శేఖర్ గౌడ్, దుర్గా నవరాత్రి కమిటీ సభ్యులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌వి కుటిల రాజకీయాలు

- **రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు, వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుభప్రద్ పటేల్**

**తాండూరు, సెప్టెంబర్ 28(ప్రజా స్వరం):**



రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో కుటిల రాజకీయాలకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర బీసీ కమీషన్ మాజీ సభ్యులు, వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుభప్రద్ పటేల్ విమర్శించారు. ఆదివారం తాండూరు పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం బీసీల రిజర్వేషన్లపై ఇచ్చిన జీఓలోనే మోసం దాగి ఉందని పేర్కొన్నారు. కేవలం జీవో మేరకే రిజర్వేషన్లను ప్రకటించే అవకాశం ఉంటే 22 నెలల సమయం ఎందుకు అవసరమని ప్రశ్నించారు. జీఓలను కోర్టు కొట్టేస్తుందని తెలిసి డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. రిజర్వేషన్ల విషయంలో తమిళనాడు తరహాలో చట్టం చేసి రిజర్వేషన్లను ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రిజర్వేషన్ల కోసం చట్టం చేసి కేంద్రానికి పంపిస్తామని చెప్పి, అనుకున్నట్లుగా చట్టంను కేంద్రానికి పంపితే పెండింగ్ లో ఉండిపోయిందని, చట్టంతో పాటు అసెంబ్లీలో తీర్మానించిన బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్ లోనే ఉండిపోయాయని తెలిపారు. చట్టం పెండింగ్ లో ఉండగానే జీఓలు ప్రకటించి మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీఓలు జారీ చేస్తే ఆయన ముఖ్య అనుచరుడు మాధవ రెడ్డి అనే వ్యక్తి ద్వారా జీఓలపై హౌస్ మోషన్ పిటిషన్ ద్వారా కోర్టుకు వెళ్లారని ఆరోపించారు. ఓ చేత్తో రిజర్వేషన్లు ఇచ్చి.. మరో చేత్తో అడ్డుకునే కుతంత్రాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎంతో పాటు మంత్రులతో సన్నిహిత సంబంధాలు ఉన్న మాధవ రెడ్డి చేతో కేసును ఉపసంహరించుకోమని చెప్పే అవకాశం లేదా అని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ బీసీ రిజర్వేషన్ల బిల్లుపై జీఓ జారీ చేస్తే కోర్టు కొట్టేసిందని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అదే జీవోల ద్వారా రిజర్వేషన్లను ప్రకటించి మోసం చేసే ప్రయత్నం చేస్తోందని అన్నారు. బీసీల రిజర్వేషన్ల చట్టంపై కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు. ఎమ్మెల్యేలో దర్నాలు చేస్తే సోనియాగాంధీ. రాహుల్ గాంధీ. మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ ఎవ్వరు. కూడా మద్దతు తెలుపలేదని, అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల రిజ్వేషన్లపై చిత్త శబద్ది లేదనే విషయం అర్థమవుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ కూడా బీసీ రిజర్వేషన్ల విషయంలో పక్షపాత ధోరణిని ప్రదర్శిస్తుందని విమర్శించారు. ఈ రెండు పార్టీలకు ఎన్నికల్లో గుణపాఠం తప్పదని అన్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. రైతుబీమా, పెట్టుబడి. మహిళలకు ఆర్థిక చేయూత, నిరుద్యోగులకు భృతి వంటి ఎన్నో హామిలను విస్మరించిందని అన్నారు. కాంగ్రెస్ చేసిన మోసాలపై కాంగ్రెస్ బాకీల కార్డు అనే ఉద్యమంతో ఇంటింటికి వెళ్లే కార్యక్రమాన్ని త్వరలో శ్రీకారం చుడుతున్నట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించి ఎన్నికల్లో బుద్ధిచెబుతామని హెచ్చరించారు.



# మజీద్‌పూర్ శివాలయం చైర్మన్‌గా కనిశెట్టి సుందర్ రావు

**శామీర్‌పేట,సెప్టెంబర్ 28(ప్రజాస్వరం) :**



మజీద్ పూర్ లోని శివాలయం గుడికి గ్రామస్తులు నూతన కమిటి ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం శివాలయం వద్ద ఏర్పాటు చేసుకొని పాలకవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. చైర్మన్ గా కనిశెట్టి సుందర్ రావు, ఉపాధ్యక్షుడి గా సామల రాంరెడ్డి, జనరల్ సెక్రెటరీగా తుంకి మల్లేష్ (పోలీస్), కోశాధికారిగా ముచ్చర్ల శ్రీ హరి, సెక్రటరీగా శ్యామల్ సురేష్, సభ్యులుగా సరసం జైపాల్ రెడ్డి, అబ్బగోని శ్రీశైలం గౌడ్, ఎల్ల సత్యనారాయణ, గంపల శంకర్, రాజేందర్ జేనా, నరేష్ జేనాలు ఎన్నుకోవడం జరిగింది. ఈ దేవాలయ పదవి కాలం రెండు ఏండ్లు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అబ్బగౌని వెంకటయ్య గౌడ్, అబ్బగౌని పెద్ద పాండు గౌడ్, అబ్బగౌని జగదీశ్వర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి తుంకి రమేష్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు అబ్బాగౌనీ భాస్కర్ గౌడ్, కోడూరి నర్మద, అబ్బగౌని ఎట్టయ్యా గౌడ్, జి.నర్సింగరావు గౌడ్, నక్క సత్యనారాయణ గౌడ్, కుడుముల వెంకటేష్, అబ్బగౌని శ్రీకాంత్ గౌడ్, అబ్బగౌని అనిల్ గౌడ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ చోరీతోనే కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారం

- **వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**

**పరిగి, సెప్టెంబర్ 28(ప్రజా స్వరం):**



లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బీజేపీ కేంద్ర ప్రభుత్వంపై 'ఓట్ చోర్.. గద్దె చోడ్' అనే నినాదంతో చేపట్టిన ఓట్ చోరీ ఉద్యమానికి మద్దతుగా ఏఐసీసీ ఆదేశాల మేరకు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు వికారాబాద్ జిల్లా పరిగి ఎమ్మెల్యే,డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ఓట్ చోరీపై తెలంగాణ గ్రామాల్లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు పరిగి పట్టణంలో పలు కాలనీలో ప్రజలను కలిసి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారం పొందిన కారణం ఓటు చోరీనే అని,ఈ అంశాన్ని ప్రతి ఇంటికి చేరవేసే బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ఉండాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఓటు చోరీ వ్యతిరేక ఉద్యమానికి మద్దతు చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని,రాహుల్ గాంధీ ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు.



# పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండ

- **పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**

**తాండూరు, సెప్టెంబర్ 28(ప్రజా స్వరం):**

అనారోగ్యంతో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పరిగి నియోజకవర్గం కామన్ పల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు . అనారోగ్యం పాలైన పేదలను ప్రత్యేక చికిత్సల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్నట్లు తెలిపారు.



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు
# మంజూరు చేస్తాం

- **ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**

**పరిగి, సెప్టెంబర్ 28(ప్రజా స్వరం) :**

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని పరిగి ఎమ్మెల్యే అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఆదివారం పరిగి మండలం సుల్తాన్పూర్ తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ పూజా కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే , డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి అధికారులు, స్థానిక నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి లబ్ధిదారులతో కలిసి నూతన గృహప్రవేశంలో పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు. లబ్ధిదారుల కుటుంబంతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. తమ సొంత ఇంటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పట్ల కృతజ్ఞతలు వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,పరిగి ఎమ్మెల్యే కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని లబ్ధిదారులు తెలిపారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**మంథని/ పెద్దపల్లి, సెప్టెంబర్ 28 (ప్రజా స్వరం):**

మంథని పట్టణంలో రామయ్యపల్లి గ్రామానికి చెందిన శ్రీ సరస్వతి విద్యా మందిర్ 200809 పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా తమకు చదువు చెప్పినటువంటి గురువులను వారు ఆత్మీయంగా సన్మానం చేశారు.చాలా కాలం తర్వాత స్నేహితులంతా ఒకచోట కలవడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరడానికి గురువులే కారణమని,తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు పునర్జన్మనిచ్చారని వారిని మర్చిపోకూడదని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు,పూర్వ స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

## ఈత చెట్టుపై నుండి పడి
# గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

**మంథని/ పెద్దపల్లి, సెప్టెంబర్ 28 (ప్రజా స్వరం):**



మంథని మున్సిపాలిటీ పరిధిలోని గంగాపురి గ్రామానికి చెందిన గీత కార్మికుడు లక్కేపూర్ శివారు సమీపంలోని తాటి వనంలో ఆదివారం నిచ్చెనపై నుండి ఈత కళ్ళు గీస్తుండగా ప్రమాదవశాత్తు నిచ్చెన కింద పడిపోవడంతో గంగాపురికి చెందిన కల్లుగీత కార్మికుడు తాటి రాజు తండ్రి బాలాజీ గౌడ్ (42)కు స్వల్ప గాయాలయ్యాయి.గీత కార్మికుడు ముళ్ళ పొదల్లో పడిపోవడంతో ముళ్ళు గుచ్చుకొని,తలకు,కాళ్లకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.గాయాలపాలైన రాజు గౌడ్ ను మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.మంథని ప్రభుత్వ వైద్యులు కరీంనగర్ హాస్పిటల్ కి రిఫర్ చేశారు.


## మున్నూరు కాపు సామాజిక భవన నిర్మాణానికి

# నిధులు మంజూరు చేయండి

- **మంత్రి శ్రీధర్ బాబును కోరిన మంథని మున్నూరు కాపు సంఘం నేతలు**



**మంథని/పెద్దపల్లి,సెప్టెంబర్28(ప్రజా స్వరం):** మంథని నియోజకవర్గ కేంద్రం మంథనిలో మున్నూరు కాపు సంఘం కార్యకలాపాల కోసం,శుభ కార్యాల నిర్వహణ కోసం,రాబోయే తరాలకు అవసరమైన డిజిటల్ లైబ్రరీ,కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణం కోసం కోటి రూపాయల ప్రభుత్వ నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును మున్నూరు కాపు సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు.ఈ మేరకు హైదరాబాద్ లో గల హైటెక్ సిటీలోని ఒక హోటల్లో జరిగిన ఓ ప్రయివేట్ కార్యక్రమంలో ఇటివలె మంత్రిని కలిసిన మున్నూరు కాపు సంఘం నేతలు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం పరిధిలో గల 10 మండలాల్లో వ్యవసాయం,ఇతర వృత్తులను నమ్ముకొని పెద్ద సంఖ్యలో మున్నూరు కాపు నాయకులు ఉన్నారని,అదేవిధంగా జనాభా ప్రకారంగా కూడా మంథని నియోజకవర్గం పరిధిలో మున్నూరు కాపులు అధిక సంఖ్యలో ఉన్నా కూడా రాజకీయంగా,ఆర్థికంగా,సామాజికంగా మున్నూరు కాపు సంఘం సభ్యులు ఇప్పటికీ వెనుకంజలోనే ఉన్నారని అన్నారు.మున్నూరు కాపు కుల సంఘం ఐక్యత కోసం గత కొన్ని ఏండ్లుగా గ్రామగ్రామాన కుల సంఘాలు ఏర్పాటు చేసుకొని ఉన్న మంథని డివిజన్ కేంద్రంలో సంఘం అవసరాల కోసం,సమావేశాల నిర్వహణ కోసం,శుభ కార్యక్రమాల నిర్వహణ కోసం స్వంత స్థలం కానీ ,భవనం కానీ లేకపోవడం చాలా ఇబ్బందిగా ఉందని,మొదటి నుండి కూడా బలహీన వర్గాలపై అందునా మున్నూరు కాపులకు అధిక ప్రాధాన్యత ఇచ్చే తమరి హయాంలో మున్నూరు కాపు సంఘం నిర్వహణ కోసం అవసరమైన స్థలాన్ని మంథని డివిజన్ కేంద్రం ఐన మంథనిలో కేటాయించి సంఘ భవన,కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కోటి రూపాయల ప్రభుత్వ నిధుల మంజూరుకు కృషి చేయాలని కోరారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వుడు స్థానాల్లో అత్యధిక స్థానాలు కేటాయించి మున్నూరు కాపులకు తగు ప్రాధాన్యత ఇచ్చి రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలని ఆ వినతిపత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు మహాసభ కన్వీనర్,హైకోర్టు న్యాయవాది ఇనుముల సతీష్,మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న,సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్,మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల కిరణ్,మంథని మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సీపతి బానయ్య,మాజీ ఎంపిటిసి ఎడ్ల సత్యనారాయణ,మంత్రి వ్యక్తిగత సహాయకుడు ఇసంపల్లి శ్రీకాంత్,మాజీ సర్పంచ్ లు అయిలి శ్రీనివాస్,సేమంతుల ఓదెలు,కుడుదుల కోటేశ్వర్,సింగిల్ విండో డైరెక్టర్ కొత్త శ్రీనివాస్,మంథని పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటరి రాజు,మంథని డివిజన్ కు చెందిన మున్నూరు కాపు సంఘం నాయకులు కూర కోటేష్,అయిలి రవి, బొడ్డు శ్రీనివాస్,ఆకుల శ్రీనివాస్,లైశెట్టి రాజు,బాసాని రమేష్,నరెడ్ల ఓదెలు,సిలివేరు మహేందర్,తొగరి ఓదెలు,తుంగల సత్తయ్య,కుడుదుల మహాదేవ్,ఎడ్ల సుమంత్,కొండ మహేందర్,చీపిరి శెట్టి రాజన్న,చాట్లపల్లి సంతోష్,సుంకరి మల్లికార్జున్,ఇసంపల్లి నారాయణ,ఇసంపల్లి శ్రీను,మానెం రాజేందర్,పెరుగు తేజ, కోరవేన రవి,దొడ్ల కమలాకర్,దొబ్బల రమేష్,కూర శంకర్,కురుమ శెట్టి సతీష్,లక్కాకుల సత్యనారాయణ,పోగుల సాగర్,చెరుకు తోట సురేష్ పాల్గొన్నారు.



## విశ్వహిందు పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆయుధపూజ

**మంథని/పెద్దపల్లి,సెప్టెంబర్28(ప్రజా స్వరం):** దుర్గా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంథని గాంధిచౌక్ విశ్వహిందు పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మవారి అనుగ్రహం అందరికి ఉండాలని ప్రతి ఒక్కరు సుఖశాంతులతో ఉండాలని కోరారు.భజరంగ్ దళ్ మంథని ప్రఖండ అధ్యక్షుడు నరేడ్ల రాజేష్ మాట్లాడుతూ హిందూ యువకులంతా ఒక్కటిగా ఉండాలని,హిందూ ధర్మం పైన జరుగుతున్న దాడులను ఎదుర్కోవడానికి ఆయుధ పూజ ద్వారా శక్తి ఉపాసన చేసి ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.మత మార్పిడి ద్వారా భారతీయ కుటుంబ వ్యవస్థను,లవ్ జిహాద్ ద్వారా హిందూ అమ్మాయిలను ట్రాప్ చేస్తున్నారని,హిందువులు అప్రమత్తంగా ఉండాలని మన ధర్మం గొప్పతనం తెలుసుకోవాలని కోరారు.భజరంగ్ దళ్ మంథని ఉపాధ్యక్షుడు బొగే సందీప్ మాట్లాడుతూ హిందూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మనలో మనం కులాల,వర్గాల,రాజకీయాలకు అతీతంగా ఉంటూ గొడవలు పడకుండా ఉండాలని,హిందూ యువతను సంఘటితం చేయడమే లక్ష్యంగా ఈ దుర్గా నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని యువత ఈ ఉత్సవాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.విశ్వహిందూ పరిషత్ సహ కార్యదర్శి నామిని నాగేష్ మాట్లాడుతూ అమాయక హిందూ అమ్మాయిలను వలలో వేసుకొని మోసం చేసే జిహాదీ మూకల అంతమే లక్ష్యంగా విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు రావుల సతీష్,కార్యదర్శి బత్తుల సత్యనారాయణ,సత్సంగం ప్రముఖ్ రాజమౌళి గౌడ్,ప్రచార ప్రముఖ్ తూర్పాటి రాము,మాచిడి శ్రీధర్,కందునూరి ఈశ్వర్ అధిక సంఖ్యలో భక్తులు భవాని స్వాములు,భవాని మాతలు పాల్గొన్నారు.

## మహచండి అవతారంలో అమ్మవారు



**ముత్తారం/పెద్దపల్లి,సెప్టెంబర్28(ప్రజా స్వరం):** దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి,అడవిశ్రీరాంపూర్,లక్కారం,ముత్తారం గ్రామాలలో ఏర్పాటు చేసిన దుర్గామాత ఆరవ రోజు మహాలక్ష్మి దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.ఈ సందర్భంగా ఖమ్మంపల్లి గ్రామంలో లీడర్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి వద్ద చండి యాగం,అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం యూత్ కమిటీ సభ్యులు చారి,రాజ్ కుమార్,సాయి,రవీందర్,రాజేందర్,అరవింద్, సత్యనారాయణ,రాజేశం తో పాటు మహిళలు పాల్గొన్నారు.

## రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులకు న్యాయం చేయాలి



**పరిగి, సెప్టెంబర్ 28(ప్రజాస్వరం):** రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో భూములు కోల్పోతున్న వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం పూడూరు మండలం రైతులకు న్యాయం చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను బిజెపి పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతీ కిరణ్ బూనేటి కలిసి వినతిపత్రం అందజేశారు . గతంలో రూపొందించిన రీజినల్ రింగ్ రోడ్డు భూముల సేకరణ ప్లాన్ ప్రకారమే భూముల సేకరణ జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి జోక్యం చేసుకొని పాత అలైన్మెంట్ ప్రకారం భూముల సేకరణకు నిర్ణయం తీసుకునేలా, రైతులకు న్యాయం చేకూర్చాలని కోరారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో బాధిత రైతులు కూడా ఉన్నారు. రైతులు ఇచ్చిన వినతి పత్రాన్ని స్పందించిన కేంద్రమంత్రి ఈ విషయంలో రైతులకు న్యాయం చేసేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.



## ఎమ్మార్పీఎస్ అత్యవసర సమావేశం

**మనోహరాబాద్ సెప్టెంబర్ 28 ( ప్రజాస్వరం ) :** ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లను పెంచేంత వరకు పోరాటం చేస్తూనే ఉంటామని ఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవ ఇంచార్జ్ బొజ్జ సైదులు మాదిగ అన్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలో పెన్షన్ల పెంపుదల విషయమై అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ వచ్చేనెల 6వ తారీకు నుండి నవంబర్ 6 తారీకు వరకు పెన్షన్ పెంపుదలకు నిర్వహించే కార్యచరణాలపై చర్చించినట్లు తెలిపారు. రిలే నిరాహార దీక్షలు రాస్తారోకోలు , ధర్నాలు వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యచరణ పై వివరణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు వర్గంటి మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్ బక్క శ్రీనివాస్, గ్రామ అధ్యక్షులు ఎర్ర నర్సింలు, నాయకులు డప్పు కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు పాలేటి మాధవి పాల్గొన్నారు.

## భూములు కోల్పోతున్న బాధితులు

# రాజీవ్ రహదారిపై రాస్తారోకో




**శామీర్‌పేట, సెప్టెంబర్ 28(ప్రజాస్వరం) :** రాజీవ్ రహదారి తూముకుంటలో రోడ్డు విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న బాధితులు ఆదివారం రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. జెఏసి చైర్మన్ తేలుకుంట సతీష్ గుప్తా, డి బ్లాక్ ఇంచార్జ్ కాసుల ఈశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో తూముకుంటలో బారి ర్యాలీ నిర్వహించి రాస్తారోకో నిర్వహించడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అనంతరం, దుకాణదారులు షాపులను మూసివేసి స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు, యజమానులు వారి జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉందని ముందస్తు భయంతో స్వచ్ఛంద బంద్ కు పిలుపునిచ్చారు. జెఏసి. చైర్మన్ సతీష్ గుప్తా మాట్లాడుతూ గత ఏడాది నుండి హైకోర్టులో స్టే ఉన్న ప్రభుత్వం మొన్న పత్రిక ప్రకటనలో విస్తరణకు అంత సిద్ధం అని అనడంతో రోడ్డు బాధితులు భయంతో అనారోగ్యంతో బాధపడుతున్నారని సతీష్ గుప్తా ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వం 200 ఫీట్లకు విస్తరణని డబల్ డెక్కర్ రోడ్డు వస్తుందన 120 ఫీట్లకు తగ్గించి కోల్పోతున్న. బాధితులను రోడ్డున పడకుండ బాధితులకు భూమికి బదులుగా భూమిని ఇచ్చి ప్రస్తుత వ్యాపార సముదాయంలో పనిచేస్తున్న ఆస్తి కోల్పోతున్న కుటుంబాలను తగిన నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం చర్చలకు రావాలని తగిన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాసుల ఈశ్వర్ గౌడ్, దయసాగర్, సూర్య ప్రకాష్ రెడ్డి, సుభాష్ గౌడ్, మల్లేష్ గౌడ్, విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.






## బతుకమ్మ సంబురాలకు ఆహ్వానం

**పరిగి, సెప్టెంబర్ 28(ప్రజా స్వరం):** సోమవారం సాయంత్రం 4:00 గంటలకు పరిగి పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి సతీమణి ఉమా రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నియోజకవర్గంలోని మహిళా సోదరీమణులు, మహిళా కాంగ్రెస్ నాయకులు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, ఈ వేడుకను విజయవంతం చేయాలని కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999